క్లుప్తంగా

వరి పంటలో తెగుళ్లపై అప్రమత్తం



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో వాసుదేవరావు

మాడుగుల రూరల్: వరి పంటకు సోకే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో ఎం. వాసుదేవరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన పలు గ్రామాల్లో వరి పంటను పరిశీలించారు. ప్రస్తుతం వరి పంటకు పాచితెగులు(పాము పొడ తెగులు), ఆకు ముడత తెగులు సోకాయని, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. మండల వ్యవసాయ విస్తరణాధికారులు సత్యనారాయణ, జగన్నాథం, వీపీఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ఆర్వోఎఫ్ఆర్ కోసం 5 లోగా దరఖాస్తులు

మాడుగుల రూరల్: మండలంలో ఆర్వోఎఫ్ఆర్ పట్టాల కోసం ఈ నెల 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు పి.వి. రత్నం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా పొందలేని ఆర్వోఎఫ్ఆర్ పట్టాదారులు ఆర్వోఎఫ్ఆర్ పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పాసుపుస్తకం, ఆధార్ నకళ్లు తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ సమాచారాన్ని పాడేరు ఐటీడీఏకు పంపిస్తామన్నారు. గతంలో ఆర్వోఎఫ్ఆర్ పట్టాదారుడు మృతి చెందితే, వారి వారసులకు గిరిమిత్ర వెబ్‌సైట్‌లో వివరాలు పరిశీలించి మ్యూటేషన్ చేస్తామన్నారు. దీని కోసం ఆర్వోఎఫ్ఆర్ పట్టా, డెత్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, వారసుల ఆధార్ బ్యాంకు పాసు పుస్తకం జెరాక్స్ కాపీలు సమర్పించాలన్నారు.

ఉపాధి పనులకు ప్రణాళికలు సిద్ధం



గ్రామ సభలో మాట్లాడుతున్న ఏపీవో నానిబాబు

నర్సీపట్నం: సర్పంచ్ నక్కపల్లి నూకాలమ్మ అధ్యక్షతన వేములపూడి పంచాయతీ కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024–25 ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపునకు గ్రామ సభ నిర్వహించారు. రూ.2.95 కోట్ల విలువైన పనులు గుర్తించామని ఏపీవో నానిబాబు సభలో వివరించారు.
ఈ నిధులతో పండ్ల తోట పెంపకం, ఎస్సీ, ఎస్టీ రైతుల భూముల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎంపీటీసీ బోళెం రాంప్రసాద్, సెక్రటరీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా సీతామహాలక్ష్మి

మాకవరపాలెం: ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ నాలుగేళ్లుగా ఎంపీడీవోగా పనిచేస్తున్న అరుణశ్రీకి డీఎల్‌డీవోగా పదోన్నతి కల్పించి విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మిని ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు.

మాజీ ఎంపీపీ మృతికి సంతాపం



మాజీ ఎంపీపీ రమణ(ఫైల్)

గొలుగొండ: మాజీ ఎంపీపీ బొడ్డు వెంకట రమణ అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన ఎంపీపీగా 2006–11 వరకు పని చేశారు. కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ఉమ్మడి విశాఖ జిల్లా గిరిజన ప్రాంతాల్లో అనేక ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారు. పేదలకు కొండ పోడు పట్టాలు ఇప్పించిన ఘనత ఆయనకు దక్కుతుంది. ఈ నేపథ్యంలో వారం రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. అల్లూరి జిల్లా కొయ్యూరు, జీకే వీధి, పాడేరు, చింతపల్లి ప్రాంతాలతోపాటు అనకాపల్లి జిల్లా నుంచి అనేక మంది నాయకులు ఆయన మృతదేహానికి పూలమాలలతో నివాళులర్పించారు.



ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో సభా స్థలికి చేరుతున్న ప్రజలు



బస్సుయాత్ర సభ దగ్గర మహిళల కోలాటం



బస్సు యాత్రకు వాహనాల్లో తరలి వస్తున్న ప్రజలు

సామాజిక సాధికార బస్సు యాత్రకు బ్రహ్మరథం



సభా స్థలికి వెళ్తున్న జైతవరం కోలాటం గ్రూపు



దేవరాపల్లిలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజేశ్వరి



బస్సుయాత్రలో తీన్‌మార్



బొత్సకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

కె.కోటపాడు: కె.కోటపాడు నుంచి ప్రారంభమైన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో సాగిన ఈ బస్సు యాత్రలో కె.కోటపాడు మండలం నుంచి వేలాది మంది స్వచ్ఛందంగా పాల్గొన్నారు. కె.కోటపాడు మండలం మీదుగా బస్సు యాత్ర సాగిన గ్రామాల ప్రధాన కూడళ్లలో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు, జెండాలతో నింపేశారు.

బస్సు యాత్రకు ముందు భారీ బైక్‌ర్యాలీ

కె.కోటపాడు నుంచి ప్రారంభమైన సామాజిక సాధికార బస్సుయాత్రకు ముందు మండలానికి చెందిన వెయ్యి బైక్‌లతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామగ్రామాన ఘన స్వాగతం నడుమ బైక్ ర్యాలీ కొనసాగింది.

దేవరాపల్లి నుంచి..

దేవరాపల్లి: మాడుగుల మండలం ఘాట్ రోడ్డు జంక్షన్ వద్ద బస్సు యాత్రకు దేవరాపల్లి మండలంలోని అన్ని గ్రామాల నుంచి భారీగా ప్రజలు తరలివెళ్లారు. ప్రతీ గ్రామం నుంచి ఆటోలు, వ్యాన్లు, ట్రాక్టర్లు, కార్లు, బైక్‌లపై ర్యాలీగా వెళ్లారు. దేవరాపల్లి నుంచి పయనమైన వాహనలను ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి జెండా ఊపి ప్రారంభించారు. యువజన విభాగం అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, మహిళ అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో బస్సు యాత్రకు చీడికాడ, మాడుగుల మండలాల నుంచి అశేష జనం తరలివచ్చారు. ప్రధానంగా చీడికాడ మండలం ఖండివరం నుంచి పార్టీ నాయకుడు సుంకర శ్రీనివాసరావు, ఇతర నాయకులు సారథ్యంలో 600 బైక్‌లతో ర్యాలీగా సభాస్థలికి చేరుకున్నారు. మంచాల నుంచి పార్టీ నాయకుడు పాటూరి రమణ సారథ్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కె.జె.పురం నుంచి ఆటోలు, ద్విచక్రవాహనాలపై మహిళలు, పార్టీ శ్రేణులు సభా ప్రాంగణానికి తరలి వచ్చారు. ఇందులో భాగంగా చీడికాడ మండలం జైతవరానికి చెందిన మహిళలు కోలాటంతో యాత్రకు స్వాగతం పలికారు. వీరితో పాటు వివిధ గ్రామాల మహిళల కోలాటం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, కె.కోటపాడు జెడ్పీటీసీ అనురాధ, మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ జెడ్పీటీలు కిమిడి రమణమ్మ, కర్రి సత్యం, లాలం శారదా వరలక్ష్మి, నాలుగు మండలాల ఎంపీపీలు వేమవరకు రామ ధర్మజ, కురసా జయమ్మ, కిలపర్తి రాజేశ్వరి, రెడ్డి జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు తాళ్లపు రెడ్డి వెంకటరాజారామ్, బూరే బాబూరావు, గొల్లవిల్లి రాజబాబు, మాడుగుల మార్కెట్‌కమిటీ చైర్మన్ శేనాపతి కొండలరావు, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు , బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, గొల్లవిల్లి సంజీవరావు, దేవరాపల్లి శ్రీనివాసరావు,గొల్లవిల్లి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



చీడికాడ మండలం ఖండివరం నుంచి బైక్ ర్యాలీగా వస్తున్న ప్రజలు



కె.కోటపాడులో మహిళలు, చిన్నారులతో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి



కె.కోటపాడులో కోలాటాలతో సందడిగా మహిళలు



ఎ.కోడూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వై.వి.సుబ్బారెడ్డి, మంత్రులు

విద్యా సామర్థ్యాల పెంపునకు సన్నద్ధం



సీఆర్పీలతో సమీక్షిస్తున్న ఎంఈవో–2 జగ్గారావు

రోలుగుంట: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంచేందుకు సన్నద్ధం కావాలని ఎంఈవో–2 జగ్గారావు సీఆర్పీలకు సూచించారు. స్థానిక ఎమ్మార్సీ భవన్‌లో గురువారం మధ్యాహ్నం ఆయన సీఆర్పీలతో సమావేశమయ్యారు. పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల వారికి శుక్రవారం నుంచి ఇప్పటి వరకు పూర్తయిన సిలబస్‌పై పరీక్షలు నిర్వహించనున్నారు. దీనిపై అవగాహన కల్పించారు. ఎం.ఐ.సి. మడ్డు వేణు, సీఆర్పీలు చిరంజీవి, సతీష్, నూర్బీ, అకౌంటెంటు శ్రీనివాసరావు, డేటా ఆపరేటర్ ఆర్. సత్తిబాబాబు, స్టాఫ్ రామచంద్రావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం రూ.21.50కు వేలం ఖరారు



తహసీల్దార్ సమక్షంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

నాతవరం: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన బహిరంగ వేలంలో కేజీ బియ్యం రూ.21.50 పైసలకు ఖరారైందని తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు గురువారం తెలిపారు. మండలంలో ఇటీవల అధికారులు నిర్వహించిన దాడుల్లో 6ఏ కేసు నమోదు చేసి, పట్టుబడిన 101.15 క్వింటాళ్ల బియ్యం బహిరంగ వేలం పాట నిర్వహించామన్నారు. ఈ వేలంలో నర్సీపట్నం, అనకాపల్లి, నాతవరం నుంచి 9 మంది పాటదారులు పాల్గొన్నారు. రూ.2,174పైగా నాతవరానికి చెందిన యర్రా కాశీవిశ్వరరావు వేలం పాడటంతో ఆయనకే ఖరారు చేశామన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ చంద్రలేఖ, వీఆర్వో బొత్సా శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

వడివడిగా తారురోడ్డు పనులు



టి.అర్జాపురం ఇటుకుల బట్టీ వద్ద చేస్తున్న పనులు



విశాలంగా నిర్మితమవుతున్న తారు రోడ్డు

రావికమతం: నియోజకవర్గానికి ప్రధానమైన బీఎస్ రోడ్డులో ఈ నెల 28న ప్రారంభించిన బీటీ రోడ్డు పనులు వడివడిగా కొనసాగుతున్నాయి. చోడవరం మండలం గంధవరం నుంచి రోలుగుంట మండలం వెలంకాయపాలెం వరకు ఈ రోడ్డు విస్తరణకు రెండేళ్ల కిందటే రూ.104 కోట్లు మంజూరయ్యాయి. అప్పట్లో ప్రారంభమైన తారు రోడ్డు పనులు ఆ తర్వాత అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో రహదారిలో పెద్ద పెద్ద గోతులు పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని విప్ కరణం ధర్మశ్రీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో డిసెంబరులోగా పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌కు ఆదేశాలిచ్చింది. కొన్ని రోజులుగా చోడవరం, బుచ్చెయ్యపేట మండలాల్లో పనులు చేపట్టగా, శనివారం నుంచి రావికమతం మండలం టి.అర్జాపురం నుంచి రావికమతం వైపు తారురోడ్డు పనులను ప్రారంభించారు. కొత్తకోటలో తారు ప్లాంటు నుంచి తారు, పిక్కను రేయింబవళ్లు తరలిస్తూ పనులు జోరుగా సాగుతుండటంతో ప్రస్తుతం శాస్త్రి గారి మామిడి తోట నుంచి మొదలుకుని ఇటుకల బట్టీ వరకూ ఎంతో విశాలంగా తారురోడ్డు నిర్మితమవుతోంది. ఇలాగే పనులు కొనసాగితే ఈ నెలాఖరుకు కష్టాలు తీరినట్లేనని వాహనదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే గణేష్‌కు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీతోపాటు పార్టీ నేతలు

గొలుగొండ: మారుమూల గ్రామాల్లో దేవాలయాల నిర్మాణం కోసం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఎనలేని కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ తెలిపారు. చీడిగుమ్మలలో గురువారం వారు మాట్లాడుతూ గతేడాది 29 దేవాలయాలు మంజూరు చేశారన్నారు. తాజాగా మరో 40 దేవాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించారని హర్షం వ్యక్తం చేశారు. మండలంలో 75 గ్రామాలకు టీటీడీ నిధులతో గుడి మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ యూత్ మండలాధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే గణేష్



విశాఖ పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు.

– నర్సీపట్నం

అందరి ఆరోగ్యమే ముఖ్యమంత్రి ధ్యేయం

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



చోడవరం సచివాలయ -4 పరిధిలో శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: అందరూ ఆరోగ్యంగా ఉండాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం పంచాయతీ పరిధి అన్నవరం సచివాలయం–4 లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 435 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని సందర్శించిన ధర్మశ్రీ ఇక్కడ అందిస్తున్న వైద్య సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండటంతోపాటు వారికి ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే, వెంటనే వైద్యం అందించాలన్న ఎంతో మంచి ఆశయంతో ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేపట్టారన్నారు. అభివృద్ధి సంక్షేమంతోపాటు ప్రజల ఆరోగ్యంపైనా జాగ్రత్తలు తీసుకున్న ఏకైక ప్రభుత్వం తమదే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్ సుందర్, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణరావు, సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి పందిరి శ్రీనువాసరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పాల సంఘం అధ్యక్షుడు సూరిబాబు, మండల యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బి. సింగవరంలో ప్రబలిన డయేరియా

మాడుగుల రూరల్: చీడికాడ మండలం బి. సింగవరంలో డయేరియా ప్రబలింది. గ్రామంలో పది మంది విరేచనాలతో బాధపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వీరిలో కొంతమందిని మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించామని ఆస్పత్రి సూపరింటెండెంట్ బి. చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదమూ లేదన్నారు.

విద్యుత్ చౌర్యం నిరోధానికి ప్రత్యేక చర్యలు



ఏడీఏ సత్యానందం

నర్సీపట్నం: విద్యుత్ చౌర్యం నిరోధానికి విజిలెన్స్ అధికారులు ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నారని ఏపీఈపీడీసీఎల్ నర్సీపట్నం టౌన్ ఏడీఏ సత్యానందం తెలిపారు. విద్యుత్ చౌర్యాన్ని నిలువరించేందుకు ప్రభుత్వం ఈ నెల 5వ తేదీ వరకు విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తుందన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక బృందాలు ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నాయన్నారు. విజిలెన్స్ బృందం అధికారులు కేసులు నమోదు చేస్తున్నారన్నారు. టౌన్‌లో లోవోల్టేజీ సమస్యల లేకుండా ప్రత్యక చర్యలు తీసుకున్నామన్నారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్ర హోమం

మాకవరపాలెం: స్థానిక వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం నుంచి ఆలయంలో రుద్ర హోమం, లక్ష్మీగణపతి హోమం, మృత్యుంజయ హోమంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు గోవాడ విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయ సిబ్బంది

చోడవరం రూరల్: మండలంలోని గోవాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల యలమంచిలి మండలం వి.కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి విశాఖ జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అండర్ –17 విభాగంలో గంగా కుసుమదీప్తి, అండర్ – 14 విభాగంలో చిరికి వసంత ఎంపికయ్యారు. వీరు పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు కె.రాము గురువారం తెలిపారు. ఆయనతోపాటు ఫిజికల్ డైరెక్టర్ జి.ఉదయభాస్కర్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.